అనకాపల్లి జిల్లా ఎస్పీ బదిలీ: కొత్త ఎస్పీగా దీపికా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జిల్లా ఎస్పీ కే.వీ మురళీకృష్ణ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులలో అనకాపల్లి జిల్లా ఎస్పీ కూడా ఉన్నారు. కొత్త ఎస్పీగా ఇప్పటివరకు విజయనగరం ఎస్పీగా కొనసాగుతున్న దీపికాను నియమించారు.

డయేరియా ప్రబలకుండా అవగాహన

విశాలాంధ్ర - చీడికాడ: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెదగోగాడ వైద్యాధికారిణి మళ్ళా శ్రీ తరణి అన్నారు. మండలంలోని తురువోలు గ్రామంలో డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రజలు మరిగించిన నీటిని త్రాగాలన్నారు. ప్రజలకు ఎటువంటి అనారోగ్యాలు ఏర్పడినా తక్షణమే సమీప హాస్పిటల్‌లో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

15న దివ్యాంగుల బస్ పాస్‌లకై ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - రావికమతం: దివ్యాంగ విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌ల కొరకు ఈనెల 15 తేదీ సోమవారం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మీ నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడులు తెలిపారు. బస్ పాసులు అందజేయడానికి అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారులు ధనలక్ష్మి, కుమార్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, బస్ పాసులు కావలసిన వారు సదరం సర్టిఫికేట్, యు.డి.ఐ.డి కార్డు జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు, 100 రూపాయలు తీసుకు రావాలన్నారు. ఈ బస్సు పాసు మూడేళ్ల పాటు పనిచేస్తుందని, సిటీలో ఉచితంగా, గ్రామీణ ప్రాంతాలలో 50 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సులో తిరగవచ్చు అన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - పరవాడ: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును అనకాపల్లి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, పరవాడ మండల తెలుగు యువత అధ్యక్షుడు పైల చినక్కునాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా పుష్ప గుచ్చాలు అందజేసి పంచకర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

నాక్ పీర్ కమిటీ సందర్శన

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ పరిధి 85వ వార్డు గొన్నవానిపాలెం గొన్న కళాశాలను శనివారం నాక్ పీర్ బృందం సందర్శించింది. బృందం ఛైర్ పర్సన్ డాక్టర్ తపన్ గోగాయి (అస్సాం తేజ్ పూర్ యూనివర్శిటీ ప్రొఫెసర్), కో ఆర్డినేటర్ డాక్టర్ హెచ్.సీ పురోహిత్ (డెహ్రాడూన్ దూన్ యూనివర్శిటీ ప్రొఫెసర్), మెంబర్ డాక్టర్ జె.వి.ఆర్.రవీంద్ర (తెలంగాణ వర్ధమాన్ కాలేజ్) తదితరుల బృందం పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ప్రమాణాల గురించి నా పేరు బృందానికి అధ్యాపకులు వివరించారు. ఈ సందర్శనలో భాగంగా బృంద సభ్యులు కళాశాలపై సానుకూల స్పందన తెలియజేసారు.

ఘోర రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కొద్ది నిమిషాల్లో కన్నవారింటికి చేరుకొని కుటుంబంతో ఆనందం పంచుకునేలోపే టిప్పరు రూపంలో మృత్యువు కాటేసింది. ద్విచక్రవాహనంపై వస్తుండగా అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రి గేటు వద్ద వెనుక నుంచి వచ్చిన టిప్పరు ఢీకొట్టి సరకాన రేవతి (27) మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు చోడవరం మండలం గోవాడ గ్రామానికి చెందిన సరకాన సతీష్ భార్య రేవతితో కలిసి గాజువాక సమీపం మిందిలోని అత్తవారింటికి వెళ్తున్నారు. అగనంపూడి ఆసుపత్రి వద్దకు వచ్చేటప్పటికి అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న టిప్పరు వెనుక నుంచి ఢీకొట్టింది. వెనుక కూర్చున్న రేవతి కిందపడ దంతో టిప్పరు కొంత దూరం వరకు ఈడ్చుకు పోయింది. నుజ్జవడంతో ఘటనా స్థలంలోనే అశువులుబాసింది. రెండేళ్ల కుమారుడు భవ్యేష్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సతీష్‌కు స్వల్ప గాయాల య్యాయి. కళ్లెదుటే ప్రమాదంలో భార్య మృతి చెందడంతో భర్త సతీష్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. టిప్పరును స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముడసర్లోవ పార్కు వద్ద పర్యావరణానికి హాని కలిగించే చర్యలు వద్దు

ఈ.ఎ.ఎస్.శర్మ ఫిర్యాదుపై స్పందించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నంలోని ముడసర్లోవ పార్క్ పరిసరాల్లో పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జీవీఎంసీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ కట్టడాలు చేపడితే పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందన్న విషయాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి, పర్యావరణవేత్త ఈ.ఎ.ఎస్. శర్మ రాసిన రాసిన లేఖపై పవన్ కళ్యాణ్ స్పందించారు. నిత్యం వందలాది మంది ప్రజలు సందర్శించే ముడసర్లోవ పార్కు 105 రకాల పక్షులకు ఆవాస ప్రాంతమని, జీవీఎంసీ ఆ పార్కులో భవనాల నిర్మాణానికి సిద్ధం అవుతోందని వచ్చిన వార్తలను ఉటంకిస్తూ.. ముడసర్లోవ పార్కును పరిరక్షించాలని కోరారు. ఈ విషయమై తక్షణం స్పందించిన పవన్ కళ్యాణ్ జీవీఎంసీ అధికారుల వివరణ కోరారు. జీవీఎంసీ అధికారులు అలాంటి ప్రతిపాదనలు ఏమీ లేవని పవన్ కళ్యాణ్‌కి తెలియజేశారు.

పాడిరైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పాడిరైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యమని మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. శనివారం మండలంలో దుప్పుతూరు గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న 10 మంది పాడిరైతులకు 10 లక్షల రుణాలను అదేవిధంగా 35 మంది పాడిరైతులకు ఏరువాక బోనస్ మేనేజర్ కూండ్రపు శేషు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ పాలకు అధిక ధర చెల్లిస్తూ, పాడిరైతుల ఆర్థిక అభివృద్ధికి హెరిటేజ్ డెయిరీ పాటుపడుతుందన్నారు. పాడిరైతులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడిరైతుల పశువులకు రాయితీపై కృత్రిమ గర్భాధారణ రూ.50, కృత్రిమ గర్భాధారణ (ఆడదూడ జన్మించుటకు) రూ.500కు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూది నానాజీ, శెట్టి శంకరరావు, శెట్టి కాసుబాబు, శెట్టి చినకాసు బాబు, శెట్టి రాంబాబు, శెట్టి శ్రీను, శెట్టి చిన్న రాంబాబు, శెట్టి ఈశ్వరరావు, శెట్టి సూరిబాబు, శెట్టి ఆదిశంకరరావు, దేశంశెట్టి కాసుబాబు, తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత చంద్రబాబుదే

మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జగన్ రెడ్డి వైసీపీ ప్రభుత్వంలో చేయలేని ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయలేని పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక నెల కాలంలోనే చేసిన ఘనత టీడీపీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీ శాసన మండలి సభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రధానమైన ఐదు డిమాండ్లను మెగా డీఎస్సీ, వృద్ధాప్య పెన్షన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, అన్నా క్యాంటీన్లు, ఉచిత ఇసుక కార్యక్రమాలను అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని, దీనికి పూర్తి సహాయ సహకారాలు పవన్ కళ్యాణ్, మోదీ ప్రభుత్వం అందిస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. 30 రోజుల్లో 30 కార్యక్రమాలను నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం అమలుకు నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రంలో జరుగుతున్న స్మగ్లింగ్ కార్యక్రమాలు గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం లాంటి వాటికి కఠిన చర్యలు తీసుకుంటూ కట్టడి చేయడానికి అధికారులకు ఆదేశాలిస్తున్నారన్నారు. ప్రజలకు, రైతులకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును సందర్శించి, వైసిపి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన విషయాలను ప్రజలకు శ్వేత పత్ర రూపంలో విడుదల చేసి ప్రజల ముందు ఉంచారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలో శ్వేత పత్రం విడుదల కానుందన్నారు. అమరావతి రాజధాని విధ్వంసంపై, తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు పెంచి, విద్యుత్ ప్రాజెక్టులను నాశనం చేసి, ప్రజలపై భారాలు మోపి, విద్యుత్ సంస్థలో జరిగిన దోపిడీ వివరాలను శ్వేత పత్రం ప్రజల ముందు పెట్టారని నాగ జగదీష్ అన్నారు. హిందువుల ఆరాధ్య దైవం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులు తిరుమలలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు, భక్తులకు సౌకర్యాలు వంటి వాటిపై ప్రక్షాళనం కోరిన దానిపై కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మొట్టమొదటి కార్యక్రమంగా తీసుకుని భక్తుల ఆలోచనకు అనుకూలంగా అన్నదానం, స్వామి వారి ప్రసాదం, దర్శనం, శానిటేషన్ వంటి వాటిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నారన్నారు. బడ్జెట్, శ్రీవాణి ట్రస్ట్, ఇంజనీర్ విభాగంలో జరిగిన అవినీతిపై విచారణకు విజిలెన్స్ కమిటీని వేసి ఆదేశాలు ఇచ్చారని, కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిసి రాష్ట్రానికి రావలసిన ఆర్థిక కార్యక్రమాల కోసం అలాగే ఏడుగురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞాపన పత్రాలు ఇచ్చే సహకారం అందించాలని కోరారని అన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యత కల్పించాలని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో చర్చలను జరిపి సహకారం అందించాలని కోరారని నాగ జగదీష్ వివరించారు. ఆగస్టు నెలలో 183 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి బడుగు, బలహీన వర్గాల వారికి ఆకలి తీర్చే కార్యక్రమాన్ని నెరవేర్చుతున్నారని నాగ జగదీష్ అన్నారు.

ఆంగ్ల భాష నైపుణ్యానికి డిజిటల్ టూల్స్ మాస్టర్ రింగ్‌పై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన బేసిక్ సైన్సెస్ హ్యుమానిటీస్ విభాగం సమగ్ర ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) "ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి డిజిటల్ టూల్స్ మాస్టరింగ్"పై దృష్టి సారించింది. ఇన్‌స్టిట్యూట్‌లోని ఫ్యాకల్టీ సభ్యులలో మెరుగైన ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అధ్యాపకులను సరికొత్త డిజిటల్ సాధనాలు, వ్యూహాలతో సన్నద్ధం చేయడానికి ఈ పరివర్తన కార్యక్రమం రూపొందించబడింది. రిసోర్స్ పర్సన్ ఇంటర్నేషనల్ ఈ.ఎస్.ఎల్. ట్రైనర్ డాక్టర్ కెజిబి.సంతోష్ కుమారి సెషన్ అధ్యాపకులకు వారి బోధనా పద్ధతుల్లో సజావుగా అనుసంధానించబడే వివిధ డిజిటల్ సాధనాలు, ప్లాట్‌ఫారమ్‌లను పరిచయం చేసింది. ఇంటరాక్టివ్ ఆకర్షణీయమైన ఆంగ్ల భాషా అభ్యాసం కోసం డిజిటల్ సాధనాలను ప్రభావితం చేసే వినూత్న బోధనా వ్యూహాలను అన్వేషించడానికి ఈ సెషన్ అధ్యాపకులకు సహాయపడింది. నిజమైన తరగతి గదిలో డిజిటల్ టూల్స్ ప్రయోగాత్మక శిక్షణ, ఆచరణాత్మక అనువర్తనాలను అందించడానికి డైట్ ఛైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభ సెషన్‌లో మాట్లాడుతూ మార్పు అనివార్యమని మారుతున్న పోకడలకు తమను తాము స్వీకరించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంటరావు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోడానికి ఆన్‌లైన్ లాంగ్వేజ్ యాప్స్, డిజిటల్ టూల్స్ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. బేసిక్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ హెచ్‌ఓడీ డాక్టర్ పి.పవిత్ర, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ పల్లా వెంకట మురళి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రమశిక్షణకు మారురూపం కీ.శే. గరిమెళ్ళ రాఘవులు

విశాలాంధ్ర - చోడవరం: ఉత్తమ క్రమశిక్షణకు మారు రూపం కీ.శే. గరిమెళ్ళ వీర రాఘవులు మాష్టారు అని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. మాష్టారు వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న నాటి విద్యార్థులు శనివారం పట్టణంలో సీతారామ కళ్యాణ మండపంలో జరిపిన ఆత్మీయ సంస్మరణ సభకు ఎమ్మెల్యే రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆప్యా యతతో కూడిన దండనలతోనే తమ విద్యార్థులకు క్రమ శిక్షణ నేర్పి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాధించిన రాఘవులు గురు పరంపర అజరామర మన్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మాష్టారు చిత్ర పటానికి ఆనాటి విద్యార్థులైన నేటి మహిళలు జ్యోతి ప్రజ్వలన చేశారు. మాష్టారు పూర్వపు విద్యార్థిథ అయిన స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పాల్గొని గురువుకు నివాళులర్పించారు. ఆనాడు గురువులు దండించ బట్టే ఈనాడు ఆయన శిష్యులు గురుతరమైన బాధ్యత కలిగిన కొలువుల్లో ఉన్నారని తెలిపారు. అప్పట్లో ఆప్యాయతతో కూడిన దండన ఉండేదన్నారు. అంతలా కొట్టినా ఇప్పటికీ ఆనాటి గురువులను మనం గౌరవిస్తు న్నామంటే కారణమదేనని ఆయన అన్నారు. మాస్టారు విగ్రహం ఏర్పాటు విషయంలో సహకరిస్తామని చెప్పారు. ప్రముఖ పాత్రికే యులు, రచయిత డా.చింతికింది శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమ శిక్షణతో మనం ఉన్నామంటే మన గురువులు మనపై చూపిన వాత్సల్యం, ప్రేమేనని తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీట ీఎఫ్ రాష్ట్ర నాయకులు బి.వెంకటపతిరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవిడ్, పసుమర్తి సాంభ, కిల్లి సత్యం మాస్టారు, స్వరూప్, కసిరెడ్డి గౌరీ శంకర్, వింజమూరి నారాయణ మూర్తి పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ముందే బీఆర్టీఎస్ పనులు పూర్తి కావాలి

అధికారులకు స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈ నెల 20న జరగనున్న గిరి ప్రదక్షిణకు ముందే బీఆర్టీఎస్ పనులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలనలో భాగంగా అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల వరకు జిల్లా కలెక్టర్ శనివారం పర్యటించి, బీఆర్టీఎస్ రహదారి పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20న జరగనున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కావున ఆ సమయానికి ముందుగానే మిగిలిన బీఆర్టీఎస్ రహదారి పనులు పూర్తి కావాలన్నారు. రహదారి పనులతో పాటు అవసరమైన విద్యుత్ దీపాలను సిద్ధం చేయాలన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు రహదారిలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. రథం ఏర్పాట్లను గురించి ఈఓను అడిగి తెలుసుకున్న కలెక్టర్ తొలిపావంచ వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టి గిరి ప్రదక్షిణలో భక్తులు పాల్గొననున్నందున, అక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గట్టి పోలీస్ బందోబస్తు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సింహాచలం దేవస్థానం ఆలయ ఈ.ఓ ఎస్.శ్రీనివాసమూర్తిని ఆదేశించారు.

గిరిప్రదక్షిణపై మరలా సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈలోగా పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలన్నారు. ఈ పర్యటనలో సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ రవికృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ఎస్.ఈ వినయ్ కుమార్, సింహా చలం దేవస్థానం ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థికి ఎమ్మెల్యే పంచకర్ల అభినందనలు

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని సరిపల్లి సమీపంలోని భాష్యం పాఠశాల విద్యార్థి సుంకరి సుశాంత్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అభినందించారు. అరకులోయ మండలం బొండం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దశరథ్ కుమారుడైన గిరిజన విద్యార్థి సుశాంత్ ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటి ఫలితాల్లో ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల యాజమాన్యం దశరథ్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు వద్దకు తీసుకెళ్లి పరిచయం చేయగా, స్పందించిన ఎమ్మెల్యే గిరిజన విద్యార్థి ప్రతిభను కొనియాడారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం సామాన్య విషయం కాదని సుశాంత్‌ను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. బాల్యం నుండి విలువలతో కూడిన జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలు, లక్ష్యాలు, కుటుంబ జీవన పరిస్థితులను అర్థం చేసుకొని భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి సుశాంత్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాల పాయింట్స్‌ను, నోట్స్‌గా తయారు చేసుకొని చదువుకునేవాడినని, అది తనకెంతో ఉపయోగపడిందని తెలిపారు. భవిష్యత్తులో ఐఏఎస్ ఆఫీసర్ కావాలనేదే తన లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో జీవిఎంసీ 95వ వార్డు జనసేన అధ్యక్షులు కే మధు, భాష్యం జోనల్ పర్యవేక్షణ అధికారి కే. వెంకట్, ప్రధానోపాధ్యాయులు కే.రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీర బ్రహ్మం, ఉపాధ్యా యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుశాంత్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేసారు.

గ్రామీణ యువతకు ఏపీఎల్ ద్వారా మంచి అవకాశం

పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వైజాగ్ వారియర్స్ ఫైనల్స్‌లోకి ప్రవేశించిందని, విజయానికి దగ్గరలో ఉన్నామని టీం ఓనర్, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు ధీమా వ్యక్తం చేశారు. వైజాగ్ వారియర్స్ ఫైనల్ చేరిన సందర్భంగా ఫ్రాంచైజీ యజమాని పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు స్థానిక హోటల్‌లో జరిగిన సమావేశంలో మీడియాతో మాట్లాడారు. బిసిసిఐ అనుమతితో నిర్వహిస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) 3వ సీజన్‌లో వైజాగ్ వారియర్స్ సగర్వంగా ఫైనల్స్‌కు చేరుకుందన్నారు. ఈ విజయం జట్టుకు, వైజాగ్ నగరానికి ఒక ముఖ్యమైన మైలురాయిని తెలిపారు. ఈ ప్రాంతంలోని అపారమైన ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. "ఈ సీజన్‌లో మా ఆటగాళ్లు అసాధారణమైన నైపుణ్యాన్ని, అంకిత భావాన్ని ప్రదర్శించారన్నారు. వైజాగ్ విశ్వసనీయత, హోదాను కాపాడుకోవడానికి నేను వ్యక్తిగతంగా ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నానన్నారు. వైజాగ్ వారియర్స్ తన సొంత ఐపిఎల్ జట్టును కలిగి ఉన్న ఏకైక నగరం మన వైజాగ్ అన్నారు. వైజాగ్‌కు చెందిన కెప్టెన్ కెఎస్ భరత్ మరియు గతంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఆడిన అనుభవజ్ఞుడైన అశ్విన్ హెబ్బార్‌తో సహా స్థానిక ప్రతిభతో జట్టు బలమైన లైనప్‌ను కలిగి ఉంది. జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లకు వారిని సన్నద్ధం చేయడం తమ ప్రాథమిక లక్ష్యం అన్నారు. వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్ మధ్య ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్ కోసం మధురువాడ క్రికెట్ స్టేడియంలో జరుగుతుందన్నారు. యువత గ్రౌండ్ లోకి వచ్చి ఆడాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రజక వారియర్స్ స్పాన్సర్షిప్‌ను మరో 9 ఏళ్ళు పొడిగించనున్నట్టు చెప్పారు.